సాక్షి చిత్తూరు

ఆదివారం । 14 । మే । 2023



'బెట్టింగ్' సంబరాలు

కర్ణాటక ఎన్నికల ఫలితాలపై పందెంరాయుళ్లు సంబరాలు జరుపుకున్నారు. తమ అంచనా నిజమైందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. -8లో..



వెనక నుంచి లారీని ఢీకొన్న కారు

తిరుపతి-బెంగళూరు జాతీయ రహదారిపై ముందు వెళుతున్న లారీని కారు ఢీకొంది. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. - 8లో..

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	41	27
తిరుపతి	42	28
తిరుమల	37	24
గూడూరు	44	31
నగరి	43	29

న్యూస్‌రీల్

రేపటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

తిరుపతి ఎడ్యుకేషన్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మినిమం టైమ్ స్కేల్ ప్రాతిపదికన డీఎస్సీ 1988, 2008, అలాగే 2018ద్వారా రెగ్యులర్ ప్రాతిపదికన కొత్తగా ఎంపికైన ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఐదు రోజుల పాటు వృత్యాంతర శిక్షణ ఇవ్వనున్నట్లు డైట్ ప్రిన్సిపల్, తిరుపతి జిల్లా డీఈఓ డాక్టర్ వి.శేఖర్ తెలిపారు. దాదాపు 770మంది ఉపాధ్యాయులకు ఈనెల 15 నుంచి జూన్ 9వ తేదీ వరకు ఒక స్పెల్‌కి 200 మంది చొప్పున శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మొదటి స్పెల్ ఈ నెల 15నుంచి 19వ తేదీ వరకు తిరుచానూరు జెడ్పీ హైస్కూల్, మిగిలిన మూడు స్పెల్స్‌ను 22నుంచి 26వ తేదీ వరకు, 29నుంచి జూన్ 2 వరకు, జూన్ 5నుంచి 9వ తేదీ వరకు తిరుపతి బాలాజీ కాలనీలోని శ్రీపద్మావతి బాలికోన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా నూతనంగా ఎంపికైన స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ ఉపాధ్యాయులకు ఎర్రావారిపాళెం ఏపీ మోడల్ స్కూల్‌లో ఈ నెల 15నుంచి 19వ తేదీ వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఈ శిక్షణకు హాజరుకాని వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని డీఈఓ తెలిపారు.

వరసిద్ధుని దర్శనానికి 6 గంటలు



భక్తులతో నిండిపోయిన క్యూ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. వేసవి సెలవుల నేపథ్యంలో శనివారం వేకువజాము నుంచే పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కంపార్ట్‌మెంట్‌లు, క్యూలు పూర్తిగా నిండిపోయాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి ఏర్పాట్లు చేయించారు. తాగునీరు, మజ్జిగ పంపిణీ చేయించారు.

కిడ్నీ బాధితురాలికి ఆర్థిక సాయం



నీరజారెడ్డికి చెక్కు అందజేస్తున్న రెడ్డి జేఏసీ నాయకులు

పెనుమూరు (చిత్తూరు అగ్రికల్చర్): మండలంలోని శెట్టిగారిపల్లెకు చెందిన విజయ్‌కుమార్ రెడ్డి భార్య నీరజారెడ్డి కిడ్నీ సమస్యతో బాధపడుతోంది. తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆమెకు శనివారం రెడ్డి జేఏసీ నేతలు రూ.32 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు హరిప్రసాద్‌రెడ్డి, జ్ఞానశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి చంద్రగిరి ఐపీఎల్

- వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్‌కు సర్వం సిద్ధం
- 1000 టీములతో టోర్నమెంట్ నిర్వహణ
- 16 గ్రౌండ్లలో తలపడనున్న 1,5000 మంది క్రీడాకారులు
- రూ.25 లక్షల నగదు బహుమతులు

చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని తుమ్మలగుంటలో ఐపీఎల్ క్రికెట్ సందడి నెలకొంది. తుడా చైర్మన్, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నేతృత్వంలో నేటి నుంచి జరగనున్న వైఎస్సార్ చంద్రగిరి ఐపీఎల్ క్రికెట్ టోర్నీకి సర్వం సిద్ధమైంది. దేశంలో మరెక్కడా లేనివిధంగా ఒకే మైదానంలో 16 జట్లు తలపడే విధంగా ఏర్పాట్లు చేపట్టడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అంతేగాక క్రీడాకారులతోపాటు ప్రేక్షకులకు సైతం మాంసాహార విందు భోజనాలు ఏర్పాటు చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



పిచ్ వద్ద మార్కింగ్ చేస్తున్న సిబ్బంది



మైదానంలో ఏర్పాట్లు

తిరుపతి రూరల్: చంద్రగిరి ఐపీఎల్ క్రికెట్ టోర్నీకి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆదివారం నుంచి దాదాపు 15 రోజుల పాటు నిరాటంకంగా జరగనున్న ఈ క్రికెట్ టోర్నీకి భారీ ఏర్పాట్లు చేపట్టారు. నియోజకవర్గ పరిధిలోని గ్రామీణ ప్రాంత యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడానికి చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏటా వైఎస్ఆర్ గ్రామీణ మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈసారి క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నారు. చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ టోర్నీ ప్రారంభానికి ముఖ్యఅతిథులుగా టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి హాజరుకానున్నారు.

ఏర్పాట్లు అదుర్స్

దేశంలో ఎక్కడాలేని విధంగా ఒకేచోట 1000 క్రికెట్ టీమ్‌ల నుంచి 1,5000 మంది క్రీడాకారులు పాల్గొనేందుకు సరిపడేలా 16 గ్రౌండ్లను సిద్ధం చేశారు. అంతేగాక టోర్నమెంట్‌లో పాల్గొన్న ప్రతి జట్టుకు ఎస్ఎస్ కంపెనీకి చెందిన రూ.20 వేల విలువైన క్రికెట్ కిట్‌ను పంపిణీ చేయనున్నారు. ఒక్కో క్రీడాకారుడికి బ్రాండెడ్ టీ షర్ట్‌తో పాటు పార్టిసిపేట్ మెడల్, పార్టిసిపేట్ సర్టిఫికెట్‌లను అందజేయనున్నారు. టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన వారికి ట్రోఫీలతో పాటు రూ.25 లక్షల మేరకు నగదు బహుమతులు అందజేస్తారు. ఎమ్మెల్యే చెవిరెడ్డితో పాటు ఆయన కుమారులు మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

అందరికీ మాంసాహార విందు భోజనం

చంద్రగిరి ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు వచ్చే క్రీడాకారులతో పాటు ప్రేక్షకులకు సైతం రుచికరమైన మాంసాహార భోజనం ఏర్పాటు చేశారు. ఇప్పటికే క్రీడా మైదానంలో వంటకాల తయారీకి సంబంధించిన ప్రత్యేక వంటశాలలను ఏర్పాటు చేయించారు. అలాగే క్రీడాకారులకు తాగునీరు, ఎనర్జీ డ్రింక్‌ను కూడా ఏర్పాటు చేసి వేసవి తాపాన్ని తట్టుకునేలా అన్ని రకాల చర్యలు తీసుకున్నారు. టోర్నమెంట్ నిర్వహణలో భద్రతాపరమైన సమస్యలు తలెత్తకుండా పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టారు.

పవన్ మాటలు సిగ్గుచేటు



మాట్లాడుతున్న రామానాయుడు

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్రానికి అన్యాయం చేసిన బీజేపీతో జతకడతామని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ మాట్లాడడం సిగ్గుచేటని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు విమర్శించారు. శనివారం చిత్తూరులో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక హోదా పేరుతో బీజేపీ నేతలు ప్రజలను నమ్మించి మోసం చేశారన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని హామీలిచ్చి విస్మరించారని మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు ఇవ్వకుండా మొండిచేయి చూపారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి పార్టీతో జతకట్టడానికి పవన్ ఎందుకు తహతహలాడుతున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తాజాగా కర్ణాటక ఎన్నికల ఫలితాలే బీజేపీపై ప్రజావ్యతిరేకతకు నిదర్శనమన్నారు. బీజేపీ ప్రభుత్వంలో వంటగ్యాస్ సిలిండర్‌ను రూ.1,200 పెట్టి కొనుగోలు చేయాల్సిన దుస్థితి వచ్చిందని విమర్శించారు. దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీల మధ్య చిచ్చు పెట్టి తాము పాగా వేయాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు.

'చుక్కల' చిక్కుకు చెక్!

బ్రిటీష్ కాలం నుంచి చుక్కల భూముల సమస్య రైతులను వేధిస్తూనే ఉంది. అప్పటి భూ సర్వేలో ప్రభుత్వ.. ప్రైవేటు భూములుగా నిర్ధారించలేని వాటికి రెవెన్యూ రికార్డుల్లో చుక్క పెట్టి వదిలేశారు. తర్వాత ప్రభుత్వాలు మారినా చుక్కల చిక్కుముడిని విప్పేందుకు ఎవరూ ప్రయత్నించలేదు. అయితే పుండు మీద కారం చల్లినట్లు సదరు చుక్కల భూములను గత టీడీపీ హయాంలో నిషేధిత జాబితాలోకి చేర్చేశారు. క్రయవిక్రయాలకు అవకాశం లేకుండా రైతులను ఇక్కట్లతోకి నెట్టేశారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ సర్కారు మరోసారి అన్నదాతలకు అనుకూలంగా వ్యవహరించింది. అనుభవదారులకే సంపూర్ణ హక్కులు కట్టబెట్టింది. చుక్కల భూములపై నిషేధాన్ని తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

- రైతు సంక్షేమమే లక్ష్యంగా సర్కారు ముందడుగు
- 54 సర్వేనంబర్లలోని చుక్కల భూముల సమస్యకు పరిష్కారం
- నిషేధిత జాబితా నుంచి తొలగించిన అధికారులు



చుక్కల భూమి ఆన్‌లైన్ చిత్రం

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి జిల్లాను పరిపాలన సౌలభ్యం కోసం చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలుగా ప్రభుత్వం పునర్ వ్యవస్థీకరణ చేసింది. దీంతో 66 మండలాలుగా ఉన్న జిల్లా ప్రస్తుతం 32 మండలాలకే పరిమితమైంది. ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో పీలేరు నియోజకవర్గంలోనే ఎక్కువగా చుక్కల భూములు ఉండేవి. విభజన తర్వాత పీలేరు అన్నమయ్య జిల్లాలో కలిసింది. అక్కడి చుక్కల భూములను సైతం అధికారులు నిషేధిత జాబితా నుంచి తొలగించారు. ప్రస్తుతం చిత్తూరు జిల్లాలోని రొంపిచెర్ల మండలంలో 54 సర్వేనంబర్లలో ఉన్న 65.64 ఎకరాల చుక్కల భూములకు మోక్షం కల్పించారు. ప్రభుత్వం జారీచేసిన 173 జీఓ ప్రకారం రెవెన్యూ రికార్డుల్లో నమోదైన చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించారు. ఈ మేరకు జిల్లా యంత్రాంగం అధికారికంగా ప్రకటించింది.

మార్కెట్ విలువ రూ.382.56 కోట్లు!

రొంపిచెర్ల మండలంలోని చుక్కల భూముల మార్కెట్ విలువ సుమారు రూ.382.56 కోట్లు ఉంటుందని అధికారులు వెల్లడించారు. ఆ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ పూర్వీకులు చుక్కల భూముల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవారని వారు వెల్లడిస్తున్నారు. తరాల తరబడి తమ స్వాధీనంలో ఉన్నా ఎలాంటి అవసరాలకు (క్రయవిక్రయాలు, రుణం, తనఖా, వారసత్వం, బహుమతి తదితరాలు) వాడుకోలేని దుస్థితి ఉండేదని వివరిస్తున్నారు. తమ భూములపై సర్వ హక్కులు కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేలును ఎప్పటికీ మరువలేమని ఆనందంగా చెబుతున్నారు.

టీడీపీ హయాంలో 'నిషేధం'

చుక్కల భూముల సమస్యలను పరిష్కరించాలని రైతులు పలుమార్లు విన్నవించుకున్నా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టించుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పైగా 2016లో ఏకంగా నిషేధిత భూముల జాబితా కింద సెక్షన్ 22ఏ(1)(ఈ) పరిధిలోకి చేర్చేశారని మండిపడుతున్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి జగనన్న చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించడమే కాకుండా, పట్టా భూములుగా హక్కులు కల్పించడంపై హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో రైతులు తమ ఆధీనంలోని భూములను సర్వ హక్కులతో క్రయ విక్రయాలు, రుణాలు పొందడానికి, తనఖా పెట్టుకోవడానికి, బహుమతిగా ఇవ్వడానికి, వారసత్వపు ఆస్తిగా అందించవచ్చని రెవెన్యూ అధికారులు వెల్లడిస్తున్నారు.

పకడ్బందీగా కసరత్తు



ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వుల మేరకు చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాం. రీసెటిల్‌మెంట్ రిజిస్టర్‌లో చుక్కలు వేసిన సర్వే నంబర్లను తొలగించేలా క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించాం. ఈ మేరకు పకడ్బందీగా కసరత్తు చేపట్టాం. ఆర్డీఓ, తహసీల్దార్లతో పూర్తిస్థాయిలో విచారణ చేయించాం. ప్రభుత్వ నిర్ణయంతో రైతులకు ఎంతో మేలు చేకూరింది.

– షణ్మోహన్, కలెక్టర్, చిత్తూరు

పక్కాగా ఆదేశాలు



చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించే ప్రక్రియపై పక్కాగా ఆదేశాలు జారీ చేశాం. జీఓ ప్రకారం కసరత్తు చేశాం. రొంపిచెర్ల మండలంలో చుక్కల భూములను గుర్తించాం. ఆ భూములను నిషేధిత జాబితా నుంచి పూర్తిగా తొలగించాం. దీంతో 54 సర్వే నంబర్లలోని రైతులకు లబ్ధి చేకూరింది.

– పి.శ్రీనివాసులు, జేసీ, చిత్తూరు

రుణపడి ఉంటాం



మాది రొంపిచెర్ల మండలం బండకింద పల్లె. మాకు గ్రామంలోని 331 సర్వే నంబర్‌లో 1.5 ఎకరాల భూమి ఉంది. ఇది చుక్కల భూమిని కావడంతో నిషేధిత జాబితా నుంచి తొలగింపు కోసం ఏళ్ల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగా. అయినా న్యాయం జరగలేదు. నా భూమి ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఎకరా రూ.30 లక్షలు పలుకుతోంది. ముఖ్యమంత్రి జగనన్న మాకు న్యాయం చేశారు. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– వేణుగోపాల్, రైతు

కుప్పం 'గజ గజ'

- మండల సరిహద్దుల్లోనే ఏనుగులు
- అడవిలోకి మళ్లించేందుకు శ్రమిస్తున్న ఫారెస్ట్ అధికారులు



కుప్పం సరిహద్దుల్లో సంచరిస్తున్న ఏనుగులు

కుప్పంరూరల్ : తమిళనాడు నుంచి జిల్లాలోకి చొరబడిన జంట ఏనుగులు కుప్పం మండలంలోనే సంచరిస్తున్నాయి. ఇప్పటికే ఈ ఏనుగులు శుక్రవారం పత్తిచేను, కృష్ణాపురం గ్రామాల్లో ఇద్దరిని బలితీసుకున్న విషయం విదితమే. ఈ క్రమంలో గజరాజులు ప్రస్తుతం శివానందపురం వద్ద తిష్టవేసి ఉన్నాయి. దీంతో కుప్పం పరిసర గ్రామాల్లోని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. బయటకు రావాలంటేనే వణికిపోతున్నారు. జంట ఏనుగులను అటవీ ప్రాంతంలోకి మళ్లించేందుకు ఫారెస్ట్ అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. శిక్షణ పొందిన ఏనుగులు జయంత్, గణేష్‌ను రంగంలోకి దించినా ఫలితం లేకపోవడంతో ఇతర మార్గాలను అన్వేషిస్తున్నారు. మండల పరిసర గ్రామాల్లోని ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అలాగే ఏనుగుల కదలికను పసిగట్టేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఏనుగుల కాప్చరింగ్ (పట్టుకోవడం)కి ఉన్నతాధికారుల అనుమతికోసం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఢిల్లీలోని చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ నుంచి అనుమతి రాగానే ఏనుగులను పట్టుకుని అటవీశాఖ ఆధీనంలోకి తీసుకునే దిశగా చర్యలు చేపడుతున్నట్లు తెలిసింది. తమిళనాడు, కర్ణాటక అటవీ శాఖ అధికారుల తీరుతోనే ఏనుగులు జిల్లా వైపునకు వస్తున్నట్లు స్థానిక ఫారెస్ట్ సిబ్బంది ఆరోపిస్తున్నారు. అక్కడి అధికారులు ఏనుగులను తరిమేందుకు క్రూరమైన విధానాలను పాటిస్తుండడం వల్లే ఏనుగులు భయాందోళనతో వచ్చేస్తున్నాయని వెల్లడిస్తున్నారు. ఏనుగులను అడవిలోకి మళ్లించేందుకు ఇక్కడ బాణసంచా, డప్పులను వినియోగిస్తుంటే, అక్కడి అధికారులు 12 ఎంఎం బోర్ పంపింగ్ యాక్షన్ గన్స్‌తో ఇనప రవ్వలను ఏనుగులపై గుప్పిస్తున్నారని మండిపడుతున్నారు. దీంతో గజరాజులు మనుషులపై కక్ష పెంచుకుని కనిపిస్తే దాడులకు దిగుతున్నాయని వివరిస్తున్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం



మాట్లాడుతున్న న్యాయమూర్తి రమేష్

చిత్తూరు అర్బన్: లోక్ అదాలత్‌తో కక్షిదారులకు సత్వర న్యాయం అందుతుందని మొదటి అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎస్.రమేష్ తెలిపారు. శనివారం చిత్తూరులోని జిల్లా కోర్టు నూతన భవనంలో మెగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లోక్‌అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించడంలో జిల్లాకు మంచి పేరు ఉందన్నారు. ఆర్థిక ఇబ్బందులతో న్యాయవాదులను సమకూర్చుకోలేని వారికి ఉచితంగా అడ్వొకేట్లను కేటాయిస్తామని వెల్లడించారు. లోక్ అదాలత్ తీర్పునకు అప్పీలు ఉండదని, కక్షిదారులకు సకాలంలో సమన్యాయం అందిస్తామని వివరించారు. సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఐ.కరుణకుమార్ మాట్లాడుతూ సత్వర న్యాయం పొందడం కక్షిదారుల ప్రాథమిక హక్కుగా సుప్రీం కోర్టు స్పష్టం చేసిందన్నారు. అందులో భాగంగానే లోక్ అదాలత్ రూపుదిద్దుకుందని, దీని ద్వారా అనేక కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకునే అవకాశం వచ్చిందని వివరించారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు, ప్రజలకు అవగాహన కలిగేలా స్టాల్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఆర్డీఓ రేణుక మాట్లాడుతూ కక్షిదారులను లోక్ అదాలత్ తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు. డీఎస్పీ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ క్షణికావేశంలో పెట్టిన కేసులను కక్షిదారుల పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవచ్చని సూచించారు. జిల్లావ్యాప్తంగా లోక్ అదాలత్‌లో మొత్తం 5,941 కేసులను రాజీ మార్గంలో పరిష్కరించినట్లు న్యాయమూర్తులు వెల్లడించారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో శనివారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 30 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 71,763 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 35,399 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.19 కోట్లు భక్తులు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం అవుతోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులు 2 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు.

క్లుప్తంగా

తల్లిపై కత్తితో కుమారుడి దాడి

చిత్తూరు అర్బన్: నగరంలోని ఇరువారంలో కళావతి అనే మహిళపై ఆమె కుమారుడు శనివారం కత్తితో దాడి చేశాడు. వివరాలు.. ఏలుమలై, కళావతి దంపతులకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తెను కొంగారెడ్డిపల్లెకు చెందిన దామోదరానికి ఇచ్చి పెళ్లి చేసి, నాలుగేళ్లుగా తమ ఇంట్లోనే పెట్టుకున్నారు. ఈ విషయం నచ్చని చిన్న కుమారుడు దినేష్ తరచూ తల్లితో గొడవపడేవాడు. కూతురు, అల్లుడిని ఇంట్లోని నుంచి పంపేయాలని కోరేవాడు. దీనిపై శనివారం గొడవ చేయడంతో కళావతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆగ్రహించిన దినేష్ కత్తితో తల్లి కళావతి తలపై నరికాడు. ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. టూటౌన్ సీఐ మద్దయ్యఆచారి కేసు నమోదు చేశారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు

నగరి : పట్టణంలోని కరకంతాపురానికి చెందిన టీడీపీ నేతలు మంత్రి ఆర్‌కే రోజా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో శనివారం చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వెల్లడించారు. నాలుగేళ్లుగా ప్రజలకు జరుగుతన్న మంచిని చూశామని, అందుకే పార్టీ మారుతున్నామని వివరించారు. టీడీపీ నేతలు ఎండీ కుప్పుస్వామి, మోహన్ మందడి, జ్ఞానశేఖర్, త్యాగరాజమొదలి, పురుషోత్తం మొదలి, రమేష్, మహేష్, పాండియన్, షోళింగరాజా, ప్రేమానందం తదితరులకు మంత్రి రోజా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంత్రి మాట్లాడుతూ సమష్టిగా పనిచేసి మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, వైస్‌చైర్మన్ బాలన్, మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, కౌన్సిలర్ చిన్నపాప, నాయకులు మురుగ, వెంకటరెడ్డి, ఎల్లప్పరెడ్డి, తనికాచలం, కృష్ణయ్య, వేలు, రమేష్,. కుట్టి, గోవిందరాజులు, అన్బు, రవి, కేశవరెడ్డి, ఆనందన్, గోవిందన్, ఆర్ముగం పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులతో మంత్రి రోజా

● అమ్మ.. అపురూపం





యాదమరి ఉన్నత పాఠశాల డ్రాయింగ్ మాస్టర్ దామోదరం ఆదివారం మదర్స్ డే సందర్భంగా అద్భుత చిత్రాలను ఆవిష్కరించారు. త్యాగమూర్తి, ఆదిశక్తి అవతారమైన అమ్మను అపురూపంగా చిత్రించారు. – యాదమరి

నదిలో పడి బాలుడి మృతి

పెనుమూరు (చిత్తూరు అగ్రికల్చర్): మండలంలోని కలవకుంట వద్ద శనివారం ప్రమాదవశాత్తు నీవా నదిలో పడి మూడేళ్ల బాలుడు మృతి చెందాడు. వివరాలు.. యాదమరి మండలం మాపాక్షి షికారీ కాలనీకి చెందిన అమరేష్, అశ్విని దంపతులు గ్రామాల్లో తిరుగుతూ చిరు వ్యాపారం చేసుకుని జీవనం సాగించేవారు. ఈ క్రమంలో వారు కలవకుంటకు వచ్చారు. స్థానిక శివాలయం సమీపంలోని నీవా నదిలో బట్టలు ఉతికేందుకు దిగారు. తమ కుమారుడు సాయిచరణ్ (3)ను సమీపంలోని గట్టుపై కూర్చోబెట్టారు. వారు బట్టలు ఉతుకుతుండగా సాయిచరణ్ ప్రమాదవశాత్తు జారి నీటిలో పడి మునిగిపోయాడు. వెంటనే తల్లిదండ్రులు బాలుడిని వెలికితీసి చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.



సాయిచరణ్ మృతదేహం

నడిచేందుకు సహకరించండి

చిత్తూరు రూరల్: మధుమేహం కారణంగా రెండు కాళ్లు పోగొట్టుకున్నానని, మళ్లీ నడిచేందుకు రూ.10లక్షలు ఖర్చవుతుందని, దాతలు సహకరించాలని బాధితుడు లోకనాథం కోరాడు. శనివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో తన తల్లితో కలిసి ఆయన మాట్లాడాడు. షుగర్ అధికం కావడంతో వైద్యులు రెండేళ్ల క్రితం తన రెండు కాళ్లు తొలగించారన్నారు. దీంతో కుటుంబాన్ని పోషించుకోలేక పోతున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. దాతలు సాయం అందించి తాను నడిచేందుకు సహకరించాలని విన్నవించాడు. ఆర్థికసాయం అందించాలనుకునే వారు 9642585860, 8790039379 నంబర్లను సంప్రదించాలని కోరారు.



మాట్లాడుతున్న లోకనాథం

'బెట్టింగ్' సంబరాలు

- కర్ణాటక ఎన్నికల ఫలితాలపై పందెంరాయుళ్ల హర్షం

పలమనేరు: కర్ణాటక ఎన్నికల్లో విజయావకాశాలపై జిల్లాలోని పందెంరాయుళ్లు భారీగా బెట్టింగులు కాశారు. దీనిపై సాక్షి పత్రికలో కాయ్ రాజా కాయ్ పేరిట కథనం ప్రచురితమైంది. అందులో పేర్కొన్నట్లుగానే కోలారు జిల్లాలో ఎన్నికల ఫలితాలు రావడం గమనార్హం. ముళబాగిళులో సంవృద్ధి మంజునాథ్, శ్రీనివాసపురంలో వెంకటశివారెడ్డి గెలుపొందారు. కేజీఎఫ్, బంగారుపేట, మాలూరు, కోలారులో సైతం కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించారు. బెట్టింగ్‌రాయుళ్ల పందెం కాసినట్లు కోలారు జిల్లాలో బీజేపీ ఒక్క సీటుకూడా గెలుచుకోలేకపోవడం విశేషం. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యమని బెట్టింగ్ బంగార్రాజులు ముందస్తుగా అంచనా వేయడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈక్రమంలో కొత్తూరు మంజునాథ్ గెలుపు సాధించడంపై పలమనేరులో సంబరాలు జరుపుకున్నారు. శ్రీవారి భక్తుడైన మంజునాథ్ పలు ధార్మిక కార్యక్రమాల్లో పాలుపంచుకునేవారు. నియోజకవర్గంలోని ఆలయాలకు విరాళాలు అందించారు. తిరుమల శ్రీవారికి కూరగాయలను పంపేందుకు రూ.40లక్షలు వెచ్చించి లారీ సైతం వితరణగా అందజేశారు. ఆయన గెలుపొందడంపై స్థానికులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ముఖ్యంగా శ్రీవారి సేవకులు కాబ్బల్లి రవి, మాజీ కౌన్సిలర్ నవీన్‌కుమార్, రవి ఫూసల, కౌన్సిలర్ శ్యామ్ సుందర్‌రాజు తదితరులు బాణసంచా కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు.

వెనుక నుంచి లారీని ఢీకొన్న కారు

గంగవరం : మండలంలోని గంగ్రాజుపల్లె వద్ద శుక్రవారం తిరుపతి– బెంగళూరు జాతీయ రహదారిపై ముందు వెళుతున్న లారీని కారు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. రాజస్థాన్‌కు చెందిన అజిత్(40), సచిన్(25) ఫర్నీచర్ డిజైనర్స్‌గా పనిచేస్తున్నారు. చిత్తూరులోని ఓ ఇంటికి ఫర్నీచర్ చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో బెంగళూరు నుంచి చిత్తూరుకు కారులో బయలుదేరారు. మితిమీరిన వేగం కారణంగా కారు ముందు వెళుతున్న లారీని వెనుకనుంచి ఢీకొంది. లారీ కిందకు కారు వెళ్లిపోయి ఇరుక్కుపోయింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికీ తీవ్రంగా గాయాలయ్యాయి. దీనిపై సమాచారం అందుకున్న హైవే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని జేసీబీ ద్వారా కారును లారీ కింద నుంచి బయటకు తీయించారు. క్షతగాత్రులను ఏఎస్‌ఐ అశ్వత్థనారాయణ, సిబ్బంది పోలీసు వాహనంలోనే పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అజిత్ పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు సీఎంసీకి రెఫర్ చేశారు.

టీడీపీ నేతల దౌర్జన్యం

- అనుమతి లేకుండా జెండా కట్టవద్దన్నందుకు దాడి
- 18 మందిపై కేసు నమోదు

రామకుప్పం: దౌర్జన్యం చేసి గాయపరిచిన టీడీపీకి చెందిన 18 మందిపై కేసు నమోదు చేసినట్లు రామకుప్పం ఎస్‌ఐ కృష్ణయ్య శనివారం రాత్రి తెలిపారు. వివరాలు ఇలా..మండలంలోని బందార్లపల్లి పంచాయతీ లింగాపురం గ్రామానికి చెందిన ఆనంద రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, మునిరెడ్డి టీడీపీ జెండాలు, తోరణాలను అదే గ్రామానికి చెందిన సుధారాణి ఇంటి వద్ద శనివారం రాత్రి కడుతున్నారు. మా అనుమతిలేకుండా ఎందుకు కడుతున్నారని ఆమె ప్రశ్నించింది. దీనిపై టీడీపీ నేతలు ఆమె,ఆమె భర్తపై మూకుమ్మడిగా దాడి చేశారు. ఆమె జుట్టు పట్టి లాగడంతో కేకలు వేసింది. చుట్టుపక్కల వారు ఆమెను కాపాడి రామకుప్పం పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేయించారు. టీడీపీ నేతలు, వారి అనుచరులు తమపై దాడి చేసారంటూ సుధారాణి రామకుప్పం పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు 18 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

అనుమానాస్పదంగా వివాహిత మృతి

చిత్తూరు అర్బన్: నగరంలోని జయలక్ష్మికాలనీకి చెందిన శాంతి (36) అనే వివాహిత శనివారం ఉదయం అనుమానాస్పదంగా మృతి చెందింది. వివరాలు.. కర్నూలు జిల్లా కోడుమూరుకు చెందిన శాంతికి 12 ఏళ్ల క్రితం చిత్తూరుకు చెందిన నాగరాజుతో వివాహమైంది. పదేళ్ల కుమారుడు ఉన్నాడు. వివాహ సమయంలో శాంతి కుటుంబసభ్యులు రూ.2లక్షలు, పది సవర్ల బంగారాన్ని కట్నం కింద నాగరాజుకు అందించారు. నాగరాజు బెంగళూరులోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ప్రస్తుతం వర్క్‌ఫ్రం హోమ్ పేరుతో ఇంట్లోనే ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి భోజనం సమయంలో భార్య,భర్త ఘర్షణ పడ్డారు. తన భర్త ఇబ్బందులకు గురిచేస్తున్నాడంటూ శాంతి, తన తల్లికి ఫోన్ చేసి చెప్పి బాధపడింది. రాత్రి 11.30 గంటల సమయంలో తాను మిద్దెపై నుంచి దూకి చచ్చిపోతానంటూ భర్తకు చెప్పినా అతను పట్టించుకోలేదు. దీంతో రెండో అంతస్తుపైనుంచి శాంతి కిందకు దూకేసింది. తీవ్రంగా గాయపడిన ఆమెను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు వేలూరుకు తీసుకెళుతుండగా మార్గం మధ్యలో మృతి చెందింది. దీనిపై సమాచారం అందుకున్న శాంతి తల్లి పార్వతి చిత్తూరుకు చేరుకున్నారు. తన కుమార్తెను అత్తింటి వారే మిద్దెపై నుంచి కిందకు తోసి చంపేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు శాంతి భర్త, అత్తామామలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భాస్కర్ వెల్లడించారు.



భర్త నాగరాజుతో శాంతి (ఫైల్)